క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ప్రతినిధులు



సీఎం జగన్‌ను కలిసిన ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ: సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం కలిశారు. ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, పలువురు ప్యానల్ సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. బుధవారం జరిగిన ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు ప్యానల్‌కు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పి పురషోత్తమ్‌నాయుడు, డీవీ రమణ, పి.కృష్ణ, పసుపులేటి శ్రీనివాసు, ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: కాకినాడ మహిళ న్యాయవాది పైడి అన్నపూర్ణపై ఈనెల 13న దాడికి నిరసనగా కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన చేస్తారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు సుబ్రహ్మణ్యం , శంకు సింగ్ మాట్లాడుతూ కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యురాలు పైడి అన్నపూర్ణ, ఆమె కుటుంబ సభ్యులతో సొంతూరు శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన సెక్షన్లతో కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేసి, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సహిత విద్య ఉపాధ్యాయుల చేయూత

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలంలో సహిత విద్య ఉపాధ్యాయినిగా పని చేస్తూ ఇటీవల అకాల మరణం పొందిన కాయల సత్యవేణి కుటుంబానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయులు రూ.41 వేల ఆర్థిక సాయాన్ని ఆర్‌జేడీ మధుసూదనరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. సహిత ఉపాధ్యాయులు అందరూ సత్యవేణి కుటుంబానికి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఆర్‌జేడీ మధుసూదనరావు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు అభినందించారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

కాకినాడ రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈనెల 25న విజయవంతంగా నిర్వహించాలని బూత్ లెవల్ అధికారులను కాకినాడ ఆర్డీవో బీవీ రమణ కోరారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో బీఎల్‌ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 25న చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్, అర్బన్, కరప తహసీల్దార్లు మురార్జీ, సీతాపతిరావు, శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాకినాడ సిటీ: బీజేపీ ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలుకుదాం–విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడ రెవెన్యూ కాలనీలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్‌తో కలసి కార్మిక మహాగర్జనకు మద్దతుగా ఈనెల 23, 24 తేదీల్లో రెవెన్యూ కార్యాలయాల వద్ద జరిగే దీక్షలపై ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'బీజేపీ ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలుకుదాం–విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం' అంటూ ఈనెల 27న విశాఖలో జరిగే కార్మిక మహాగర్జనకు మద్దతుగా రెవెన్యూ డివిజన్లలో ఈ దీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 25న జిల్లాల కలెక్టరేట్ వద్ద నిరసనలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బోడకొండ, పెద్దిరెడ్డి సత్యనారాయణ, లోవరత్నం, అప్పలరాజు, శాఖ రామకృష్ణ, పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాసరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరంలో.. తీర్థం

- రేపు చొల్లంగి అమావాస్య
- కాకినాడ జిల్లాకే ప్రసిద్ధి
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- దేవదాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు



ఉప్పలంక శివారు మొండివద్ద సంగమేశ్వరస్వామి ఆలయంలోని బాలాత్రిపుర సమేత సంగమేశ్వరస్వామి

కరప: పురాణ ప్రసిద్ధి గాంచిన చొల్లంగి అమావాస్య తీర్థం శనివారం కరప మండలం ఉప్పలంక శివారు మొండి వద్ద సముద్ర తీరాన జరగనుంది. ఈ తీర్థం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అతి ప్రాముఖ్యమైంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి సముద్రస్నానం చేయడం పరిపాటి. దేవదాయ, పోలీసు శాఖలతో పాటు, ఉప్పలంక గ్రామ పంచాయతీ తీర్థం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఏటా మాఘమాసం ప్రారంభమయ్యే అమావాస్య రోజున ఈ తీర్థం జరుగుతుంది.

తుల్యభాగ నదీపాయ సముద్రతీరంలో కలిసే ప్రదేశమే సాగరసంగమం. చంద్రుడు శాప విమోచనం పొందుటకు తన భార్య రోహిణితో కలిసి ఈ సాగర సంగమం వద్ద శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయడంతో శివుడు ప్రత్యక్షమై మోక్షం కలిగించినట్టు పురాణగాథలు తెలుపుతున్నాయి. చొల్లంగి వద్ద సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితమే రాజ రాజేశ్వరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయం నిర్మించినట్టుగా చెబుతారు. మొండి వద్ద సముద్రతీరాన 107 ఏళ్ల క్రితం మల్లాడి సత్యలింగం నాయకర్ సంగమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్టు ఈప్రాంత ప్రజలు చెబుతారు. ఈ ఆలయంలో బాలాత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి పక్కనే సీతారాములు, ఆంజనేయస్వామి, కాలభైరవ స్వామి వార్ల ఆలయాలు కూడా ఉంటాయి. తర్వాత పక్కనే ఉన్న చొల్లంగిలో చంద్రుడు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామివారి శివలింగాన్ని భక్తులు దర్శించుకుంటారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి సముద్రస్నానమాచరించి సంగమేశ్వర స్వామి, భైరవ స్వామి, సోమేశ్వరస్వామివార్లను దర్శించుకొంటారు. చొల్లంగి అమావాస్య మరుసటి రోజు నుంచి సప్త సాగర యాత్ర ప్రారంభమవుతుంది. చొల్లంగి, కోరంగి, తీర్థాల మొండి, రామేశ్వరం, బ్రహ్మసమాఖ్యం, నాసంగితిప్ప, అంతర్వేదిలలో సముద్రస్నానం చేస్తే సప్త సాగర యాత్ర పూర్తవుతుంది. ఈ యాత్ర తర్వాత అంతర్వేదిలోని లక్ష్మీ నరసింహ స్వామి తీర్థం జరుగుతుంది. చంద్రుడికి శివుడు ప్రత్యక్షమైనప్పుడు నందీశ్వరుడికి కూడా వరమివ్వడం వల్లనే చొల్లంగి అమావాస్య రోజున అప్పన్నెద్దులను తీసుకొచ్చి సముద్రస్నానం చేయిస్తారని పండితులు చెబుతుంటారు. గ్రామాల్లోని వీరభద్రుడు గద్దెల నుంచి ప్రభలను తీసుకొచ్చి చొల్లంగి తీర్థం రోజున సముద్రస్నానం చేసి, సంగమేశ్వర స్వామి, భైరవస్వామి, సోమేశ్వరస్వామివార్లను దర్శించుకుంటారు. కాకినాడరూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



చొల్లంగి వద్ద చంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం ఇదే (ఫైల్)

ట్రాఫిక్ మళ్లింపు

చొల్లంగి తీర్థం రోజున ఎంఎస్ఎన్ చారిటీస్ నుంచి మొండివద్ద స్నానాల రేవు వరకు భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌ను ఒక రోజు(శుక్రవారం అర్ధరాత్రి నుంచి) మళ్లిస్తున్నట్టు కరప ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. యానాం వైపు నుంచి తాళ్లరేవు మీదుగా వచ్చే వాహనాలు పటవల వద్ద నుంచి జి.వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు గ్రామాల మీదుగా కాకినాడకు చేరుకుంటాయన్నారు. కాకినాడ నుంచి తాళ్లరేవు, యానాం వైపు వెళ్లే వాహనాలు కాకినాడ, తూరంగి, నడకుదురు, గురజనాపల్లి మీదుగా యానాం రోడ్డుకు చేరుకుని వెళతాయన్నారు. స్నానాలరేవు వద్ద , ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉప్పలంక సర్పంచ్ బొమ్మిడి నయోమి, గ్రామ కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్ తెలిపారు.

ప్రజల నమ్మకానికి వందేళ్లు



దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి

బోట్‌క్లబ్: ప్రజల నమ్మకానికి వందేళ్లని ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అన్నారు. కేసీబీఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం సంఘ కార్యాలయంలో సభ్యులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాజీ అధ్యక్షుడు దివంగత కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. దంత వైద్యులు సీహెచ్ఎస్‌వీఎస్ఎల్ ప్రవంతి, సువర్ణరాజు సభ్యులు దంత పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముమ్మిడి వెంకటరమణ, ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాల యోగి, కోసూరి లక్ష్మీ ప్రసాదలావణ్య, సంఘ మేనేజర్ చీమలకొండ గంగాధరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వారంగ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి



ఆక్వాఎక్స్ పో ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఆక్వారంగ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. స్థానిక ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే ఆక్వా ఎక్స్ పో 2023 ఆహ్వాన పత్రికలను గురువారం ఆమె ఆవిష్కరించారు. 2019 నుంచి ఆక్వారంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. కరోనా కారణంగా ఎగుమతులు నిలిచిపోవడంతో ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రైతులకు ఊరట లభించిందన్నారు. ఆక్వా రైతులు కరెంటు సబ్సిడీ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆక్వా ఎక్స్‌పో విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. ఎక్స్‌పో నిర్వాహకుడు కె.జోసఫ్ మాట్లాడుతూ ఆక్వా రంగంలో అధిక దిగుబడులు ఎలా సాధించాలి?, వాటికి వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలపై శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి రైతులు ఈ ఎక్స్ పోలో పాల్గొంటారన్నారు. ఈ ఎక్స్‌పోను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభిస్తారన్నారు.

హిందూస్థానీ సంగీత విద్వాంసుడికి సత్కారం



హరీష్‌ను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గోదావరి పుష్కరాల్లో తప్పిపోయి కాకినాడ పరివర్తన వీధిబాలల పునరావాస కేంద్రంలో ఉంటూ హిందూస్థానీ సంగీత విద్వాంసుడిగా పేరుగాంచి గోల్డ్‌మెడల్ పొందిన హరీష్‌ను గురువారం రాత్రి రోటరీహాల్‌లో రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభిశారద ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ పరివర్తనకు రుణపడి ఉంటానన్నారు. పరివర్తనలో ఉంటూ చదువుకొని లక్కరాజు శేషుకుమారి ఆర్థిక సహాయంతో లక్నోలోని యూనివర్సిటీలో చేరి హిందూస్థానీ సంగీతంలో పీజీ చేసి గోల్డ్‌మెడల్ సాధించినట్టు చెప్పారు. అనంతరం హరీష్‌ను రోటరీ సభ్యులు, పరవర్తన కార్యవర్గ సభ్యులు సత్కరించారు.

సమాజసేవలో రోటరీ గోల్డ్

బోట్‌క్లబ్: రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రత్యేక సమావేశం గురువారం స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. బ్లడ్ బ్యాంకుకు అవసరమైన మల్టీపర్పస్ బ్లడ్ కలెక్షన్ అంబులెన్స్ సమకూర్చడంలో ప్రముఖ న్యాయవాది కృష్ణ ప్రకాష్, గోవిందరాజులు చేసిన సహకారానికి కృతజ్ఞతగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్లడ్‌బ్యాంకు అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంక్ సేవలు సకాలంలో ప్రజలకు అందేలా అనేక చర్యలు తీసుకోవడమే కాక, రక్షపరీక్ష విధానంలోనూ అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు కృష్ణప్రకాష్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా విభాగాల ద్వారా సమాజానికి సకాలంలో సేవలు అందిస్తున్నామన్నారు. అందులో బ్లడ్‌బ్యాంక్ సింహభాగం వహిస్తుందన్నారు. రోటరీ వృద్ధాశ్రమం ద్వారా ఇన్‌మేట్స్ మహిళలకు కూడా సేవలు అందించేందుకు ప్రత్యేక సబ్‌కమిటీ ఉదయభాను, సత్తి రవిరెడ్డి స్వీయ పర్యవేక్షణలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



జిల్లా పరిషత్‌లో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఈవో సత్యనారాయణ, తదితరులు

కాకినాడ సిటీ: స్థానిక జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. సీఈవో సత్యనారాయణ మాట్లాడుతూ సంఘ సంస్కరణలను ప్రబోధించే సర్వసమానత్వం, అస్పృశ్యత ఖండన, నైతిక ప్రబోధం, మూఢనమ్మకాల ఖండన మొదలైన అభ్యుదయ భావాలను సూచించే పద్యాలను ప్రబోధించిన గొప్ప మానవతావాది వేమన అన్నారు. వేమన సూచించిన మార్గనిర్దేశంలో ప్రజలందరూ నడవాలన్నారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉప సీఈవో ఎ.రమణారెడ్డి, పరిపాలనాధికారులు, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

కాకినాడ రూరల్: యోగి వేమన జయంతిని కాకినాడ రూరల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ నాగభూషణం తదితరులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వేమన తన కవిత్వం, పద్యాలను సరళంగా వివరించి, ఎంతో విలువైన మెసేజ్‌ను ఇచ్చారన్నారు.

బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో..

సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, పార్థసారథి, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, తదితరులు వేమన చిత్రపటానికి నివాళులర్పించారు.

యోగివేమన జీవితం ఆదర్శం

కాకినాడ: ప్రజా కవి, సంఘసంస్కర్త యోగివేమన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగి వేమన జయంతిని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కమిషనర్ రమేష్, ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావుతో పాటు పలువురు అధికారులు ఉద్యోగులు, యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ రమేష్, ఏడీసీ నరసింహారావు తదితరులు

యోగి వేమనకు ఘన నివాళులు

కరప: కరప మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ మహనీయుని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కర్రి స్వప్న, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సత్తిబాబు, ఏవో గుత్తుల భీమశంకరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాది సంక్షేమ ప్రభుత్వం.. అర్హతే ప్రామాణికం

- ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరింది.. సీఎం జగన్‌కు మరోసారి ఆశీస్సులివ్వండి
- కరప మండలం గొడ్డటిపాలెంలో గడప గడపకూలో ఎమ్మెల్యే కన్నబాబు



గొడ్డటిపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటున్నామని, మాది సంక్షేమ ప్రభుత్వమని, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కరప మండలం అరట్లకట్ట సచివాలయం పరిధిలోని గొడ్డటిపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. సంక్రాంతి పండగ తరువాత తొలిసారిగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కన్నబాబుకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి ఆయన ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా పొందిన లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తుల సమస్యలను ఆలకించి వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పన చేపడతామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హత గల ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మూడున్నరేళ్లలో లబ్ధి చేకూరిందన్నారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, పింఛన్ కానుక, కాపు నేస్తం, ఇళ్ల పట్టాలు.. ఇలా అనేక విధాలుగా లబ్ధిని అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీస్సులు మరోసారి అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దింశెట్టి సుజాత, సింగినీడి నాని, చినబాబు, రాయుడు జగన్నాథరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడను అభివృద్ధిలో అగ్రగామి చేస్తా

గడపగడపకూలో ఎమ్మెల్యే ద్వారంపూడి



'గడపగడపకూ'లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కాకినాడ నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన 8వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సాంబమూర్తినగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న సచివాలయ, వలంటరీ వ్యవస్థ, ఇతర పాలనా సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. తప్పుడు హామీలతో, ప్రభుత్వంపై బురద జల్లుతూ టీడీపీ, జనసేన వంటి పార్టీలు ప్రజల ముందుకు వస్తున్నాయని, వారిని నమ్మొద్దని ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, చిట్నీడి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ బెడ్ మంచం అందజేత

కాకినాడ సిటీ: గొర్రెపిండి సత్యశేఖర్ అనే సచివాలయం ఉద్యోగి జ్ఞాపకార్థం నగరపాలక సంస్థకు చెందిన సచివాలయం ఉద్యోగులు మానవీయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి సింగిల్ బెడ్ మంచాన్ని గురువారం రాత్రి బహూకరించారు. టీపీఆర్‌వో కృష్ణమోహన్ చేతుల మీదుగా ఈ సింగిల్ బెడ్ మంచాన్ని సంక్షేమ, ఆర్థిక కార్యదర్శులు ఆర్థిక సాయంతో అందజేశారు.

సంక్షిప్తంగా..

ఆర్అండ్‌బీ గృహానికి చేరుకున్న కొమ్మినేని

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం రాత్రి కాకినాడ ఆర్అండ్ బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ, కాకినాడ అర్బన్ తహసీల్దార్ పీవీ సీతాపతిరావు ఆహ్వానం పలికారు. ఈయన శుక్రవారం కోరంగిలో జరగనున్న మడ అడవుల సంరక్షణ–మీడియా పాత్రపై నిర్వహించే ప్రత్యేక అవగాహన సదస్సులో పాల్గొంటారు. ఈయనతో పాటు అకాడమీ కార్యదర్శి ఎం బాలగంగాధర్‌తిలక్ ఉన్నారు.

పేదలపై విద్యుత్ భారాలు దుర్మార్గం

కరప: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వస్తే విద్యుత్ బాదుడు ఉండదని, 200 యూనిట్ల లోపు వినియోగించుకునే అన్ని తరగతుల వారికీ ఉచితంగా విద్యుత్ అందిస్తామని మాట ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి నేడు మాట తప్పి పేదలపై భారాలు మోపడం దుర్మార్గమని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ నియోజకవర్గం, కరప మండలంలోని కొరుపల్లి గ్రామంలో ఇంటింటికి మీ అనంతలక్ష్మి, ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మిస్డ్ కాల్ ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను వివరించారు.

నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలి

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం సాయంత్రం సీపీఎం నగర సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. కాకినాడ నగరంలో విపరీతంగా ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతుందన్నారు. 216 జాతీయ రహదారి పూర్తి కాకపోవడంతో పిఠాపురం, సామర్లకోట రోడ్ల మీదుగా రామచంద్రపురం, యానాం రోడ్ల వైపు వెళ్లాల్సిన వాహనాలు కాకినాడ మెయిన్‌రోడ్ మీదుగా వెళుతున్నాయన్నారు. దీని వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతుందని సీపీఎం నాయకులు అన్నారు. కొండయ్యపాలెం ఫ్లైఓవర్ త్వరితగతిన ప్రారంభించాలన్నారు. గొడారిగుంట మీదుగా వచ్చే 100 అడుగుల రోడ్డు పూర్తి చేసి ఉప్పుటేరుపై మూడో వంతెన నిర్మాణం జరిగితే నగరంలో ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో వ్యవహరించి నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, మేడిశెట్టి వెంకటరమణ, మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ నేషనల్ టాలెంట్ టెస్ట్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు: ఇండియన్ నేషనల్ టాలెంట్ టెస్ట్ ఒలంపియాడ్ మొదటి లెవెల్ పరీక్షల్లో కాకినాడ సాంబమూర్తినగర్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి లెవెల్ పరీక్షల్లో 346 మంది ప్రతిభ చూపి రెండో లెవెల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల బృందాన్ని ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ సుల్తానా, జోనల్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్, ఇన్‌చార్జ్ అనంత్, రామారావు పాల్గొన్నారు.

నియమ, నిబంధనలతో పని చేయాలి

కాకినాడ సిటీ: సహిత (భవిత) కేంద్రాల్లోని ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్టులు నియమ, నిబంధనలతో పని చేయాలని ఆర్‌జేడీ డి మధుసూదనరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం కాకినాడ అర్బన్, రూరల్, సామర్లకోట, పెద్దాపురం, కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం, తాళ్లరేవు మండలాలకు చెందిన ఐఈఆర్‌పీల (సహిత ఉపాధ్యాయులు)తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఐఈఆర్‌పీలు, ఫియోథెరపిస్టులు తప్పని సరిగా సమయపాలన పాటించాలన్నారు. భవిత సెంటర్లలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి రోజూ పిల్లలు ఎంతమంది హాజరవుతున్నారో వాట్సాప్ ద్వారా టీచర్ కవర్ అయ్యేలా ఒక ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి శనివారం హోమ్ బేస్డ్ పిల్లల వివరాలు, సమయం, యాక్టివిటీ వివరాలతో కూడిన ప్రొఫార్మా, హోమ్‌బేస్డ్ ఒక నిమిషం వీడియోను కూడా వాట్సాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆర్‌జేడీ మధుసూదనరావు సూచించారు. ఈనెల 26న సమగ్రశిక్ష, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి అందుబాటులో ఉన్న సహిత ఉపాధ్యాయులు హాజరై ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సహిత విద్య కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయాల పరిశీలన

కాకినాడ సిటీ: కాకినాడ నగరం పర్లోవపేట ప్రాంతంలో నిర్మిస్తున్న టిడ్కో(ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హౌసింగ్ స్కీమ్) గృహ సముదాయాన్ని గురువారం సీపీఎం బృందం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులు అప్పులు చేసి రూ.లక్ష డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించారన్నారు. దీంతో పాటు రూ.మూడు లక్షలు బ్యాంకు రుణం మంజూరైందన్నారు. లబ్ధిదారులు ఇప్పటికే అద్దె ఇళ్లల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో నిర్మిస్తున్న 84 బ్లాక్‌లకు గాను 36 బ్లాక్‌లలో విద్యుత్, నీటి సరఫరా ఏర్పాటు చేస్తే వెంటనే లబ్ధిదారులకు అప్పగించవచ్చన్నారు. తక్షణమే మున్సిపల్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు స్పందించి టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు.